క్లుప్తంగా

నేడు స్వామివారి కల్యాణం

పెనుగంచిప్రోలు:స్థానిక మునేరు కాజ్‌వే పక్కన వేంచేసియున్న శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి కల్యాణం మంగళ వారం రాత్రి 8గంటలకు నిర్వహించనున్నట్లు వంశపారంపర్య ధర్మకర్త కొమరగిరి రఘురామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణం కోసం ఏడు గంటలకు ధర్మకర్తలు చంద్రకాంతారావు ఇంటివద్ద నుంచి పసుపు, కుంకుమ, తలంబ్రాలు, పట్టు వస్త్రాలను మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకువస్తారన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని రఘురామారావు కోరారు.

వైభవంగా నాభిశిల ప్రతిష్ఠ



భీమవరం(వత్సవాయి) : గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన నాభిశిల(బొడ్డురాయి) ప్రతిష్ఠ కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే పూజాకార్యక్రమాలను పూర్తిచేసిన అనంతరం పండితులు నిర్ధేశించిన సమయానికి గ్రామ పురోహితులు దుర్భాకుల హరికృష్ణశర్మ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాభిశిలతోపాటు ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం, పోతురాజు మరియు రామాలయ శిఖర ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమానికి పెద్దసంఖ్యలో భక్తులు హాజరై పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎస్ఐ బి అభిమన్యు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రూ.1.50లక్షల విరాళం



నందిగామ : అంబారుపేటలో వేంచేసియున్న శ్రీ సత్యమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో మూడో రోజైన సోమవారం అమ్మవారికి నిత్యపూజలతోపాటు అభిషేకాలు చేశారు. అమ్మవారికి విజయవాడకు చెందిన యానం ఫణేంద్రనాగ్ అనే భక్తుడు రూ.1.50 లక్షల విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ ఈవో సీతారామయ్యకు అందజేశారు.

పేటలో ఐదు నామినేషన్లు దాఖలు



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గానికి సంబంధించి సోమవారం ఐదుగురు అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వెంకటేశ్వర్లు తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున సామినేని విమల, జైభీంరావ్ భారత్ పార్టీ అభ్యర్థిగా కరిసె మధు తమ నామినేషన్లను దాఖలు చేశారు. స్వతంత్ర్య అభ్యర్థులుగా జొన్నకుటి అహరోను, మేడేపల్లి ఫ్రాన్సిస్, అయిలపోగు వెంకటేశ్వర్లు నామినేషన్లు వేశారు. ఏఆర్‌వో, పేట తహసీల్దార్ జి.శేషగిరి, ఎలక్షన్ సిబ్బంది శ్రీనివాసకుమార్ పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ: నందిగామ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి టీడీపీ అభ్యర్థి తంగిరాల సౌమ్య సోమవారం తన నామినేషన్ దాఖలు చేశారు. ఆమె వెంట ఆపార్టీ నాయకులు ఉన్నారు.

46మంది వలంటీర్లు రాజీనామా



చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని పలు గ్రామాల్లో పని చేస్తున్న 46మంది గ్రామ వలంటీర్లు తమ విధులకు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో ఎంపీడీవో రమేష్‌బాబు తెలిపారు. పోచంపల్లిలో 17 మంది వలంటీర్లు, కె.అగ్రహారంలో 11మంది, వేదాద్రిలో 11మంది, బూదవాడలో ఆరుగురు, అన్నవరంలో ఓ వలంటీర్ కలిపి మొత్తం 46మంది రాజీనామాలు సమర్పించినట్లు ఎంపీడీవో వివరించారు.

నందిగామలో 17మంది రాజీనామా..

నందిగామ: మండలంలో 17మంది వలంటీర్లు తమ విధులకు రాజీనామా చేశారు. పల్లగిరిలో 10మంది వలంటీర్లు, కమ్మవారిపాలేనికి చెందిన ముగ్గురు, మునగచెర్లకి చెందిన నలుగురు వలంటీర్లు తమ రాజీనామాపత్రాలను ఎంపీడీవో ఎం.విశ్వనాథ్‌కు అందజేశారు.

వీరులపాడులో 20మంది రాజీనామా..

వీరులపాడు: వీరులపాడు గ్రామానికి చెందిన 20 మంది వలంటీర్‌లు తమ విధులకు రాజీనామా చేశారు. ఈ మేరకు వారు సోమవారం తమ రాజీనామాపత్రాలను ఎంపీడీవో శివ పార్వతికి అందజేశారు.

టెన్త్ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల సత్తా



పేరపోగు పూజ (581)



షేక్ ఇస్మాయిల్ (578)



గుంటూరి రాజ్యలక్ష్మి (577)



మాతంగి కీర్తన (576)



సీహెచ్ గాయత్రి (568)



ఆదూరి సువార్త (568)



బి.రమ్యశ్రీ (564)

జగ్గయ్యపేట అర్బన్, జగ్గయ్యపేట: పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో జగ్గయ్యపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి సత్తా చాటారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, వసతులు కల్పించడం, మెరుగైన విద్యాబోధన ద్వారా విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదోతరగతి పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించారు. జగ్గయ్యపేట పట్టణంతోపాటు మండలంలోని 12 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, డాక్టర్ బీఆర్.అంబేద్కర్ బాలికల గురుకులం, ఎస్టీ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాలల్లో 90శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో ఎల్.చిట్టిబాబు తెలిపారు. మండలంలో మొత్తం 819మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 734 మంది ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు.బలుసుపాడు రోడ్‌లోని డాక్టర్ బీఆర్అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన పేరపోగు పూజ 581మార్కులతో మండలస్థాయిలో ప్రథమస్థానంలో నిలువగా, జగ్గయ్యపేట పట్టణంలోని జడ్పీ బాలికల హైస్కూల్‌కు చెందిన సీహెచ్. గాయత్రి 568 మార్కులు, పేటలోని ఏపీ సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన ఆదూరి సువార్త 568 మార్కులతో ద్వితీయస్థానం, చిల్లకల్లు జడ్పీ హైస్కూల్‌కు చెందిన బి.రమ్యశ్రీ 564 మార్కులతో తృతీయ స్థానం సాధించినట్లు ఎంఈవో తెలిపారు. పేటలోని డాక్టర్ బీఆర్. అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 79మందికిగాను 78మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. పేట జడ్పీ బాలుర హైస్కూల్‌లో 168మందికిగాను 124మంది(74 శాతం) ఎస్టీ గురుకుల పాఠశాలలో 25మందికిగాను 24మంది(96 శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పోచంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 43మందికిగాను అందరూ పాసై నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో వివరించారు. తన తల్లిదండ్రులిద్దరూ చనిపోవడంతో బాబాయి సహకారంతో గురుకుల పాఠశాలలో చదువుతున్న నిలిచిన ఆదూరి సువార్త మండలస్థాయిలో ద్వితీయస్థానంలో నిలిచిందని ఎంఈవో వివరించారు. అత్యుత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులందరికీ ఎంఈవో శుభాకాంక్షలు తెలియజేశారు.

వత్సవాయిలో 97శాతం ఉత్తీర్ణత

వత్సవాయి :పదో తరగతి పరీక్షల్లో వత్సవాయి మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు 97 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో ఎల్ నాగరాజు తెలిపారు. మండలంలో మొత్తం తొమ్మిది ప్రభుత్వ పాఠశాలలుండగా 408 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 392 మంది ఉత్తీర్ణత సాధించారు. వత్సవాయిలోని ఎంజేపీ పాఠశాలకు చెందిన షేక్ ఇస్మాయిల్ 578 మార్కులు, పోలంపల్లి, కంభంపాడు, కన్నెవీడు, భీమవరం, గోపినేనిపాలెం, వత్సవాయిలోని ఎంజేపీ పాఠశాలలు 100శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఎంజేపీ పాఠశాలకు చెందిన షేక్ ఇస్మాయిల్ 578 మార్కులతో మండలస్థాయిలో ప్రథమ స్థానం సాధించగా వత్సవాయి జెడ్పీ పాఠశాలకు చెందిన గుంటూరు రాజ్యలక్ష్మి 577మార్కులు, మాతంగి కీర్తన 576మార్కులతో మండలస్థాయిలో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించినట్లు ఎంఈవో వివరించారు. ప్రైవేటు పాఠశాలల నుంచి 117మంది పరీక్షలు రాయగా 117మంది ఉత్తీర్ణులయ్యారు. విద్యార్థి ఇస్మాయిల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నాడు-నేడు ద్వారా మా పాఠశాలల రూపురేఖలు మారిపోయాయన్నారు. అన్ని సౌకర్యాలను కల్పించడంతోపాటు ఉపాధ్యాయులు కూడా ప్రత్యేకశ్రద్ధ వహించి బోధన చేయడంతోనే ఈ మార్కులు సాధించగలిగామని హర్షం వ్యక్తం చేశారు.



576 మార్కులు సాధించిన పి.నాగప్రతిభకు స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు

పెనుగంచిప్రోలులో..

పెనుగంచిప్రోలు:పదోతరగతి పరీక్షా ఫలితాల్లో పెనుగంచిప్రోలు మండలంలోని ఏడు ప్రభుత్వ పాఠశాలల్లో 81శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ రవీంద్ర తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల నుంచి మొత్తం 312 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 254మంది ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. 600 మార్కులకు గాను 563 మార్కులతో పెనుగంచిప్రోలు కెవీఆర్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కొండపల్లి దివ్య 600 మార్కులకుగాను 563 మార్కులు సాధించగా, ముండ్లపాడు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన కోలా మహేష్ 553 మార్కులు, గొర్రెపాటి సృజల 549 మార్కులతో వరుసగా మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. అదేవిధంగా పెనుగంచిప్రోలు శ్రీచైతన్య టెక్నోస్కూల్‌లో 64 మంది విద్యార్థులకు 63మంది ఉత్తీర్ణత సాధించారు. అత్యధికంగా షేక్ మునాఫ్ 589 మార్కులు సాధించారు. అనిగండ్లపాడు శ్రీచైతన్య హైస్కూల్ లోబేరి జశ్వంత్ 582 మార్కులు, నవాబుపేట విశ్వవాణి విద్యాలయం నుంచి మొండితోక సౌమ్య 573 మార్కులు, పెనుగంచిప్రోలు శ్రీతక్షశిల స్కూల్ నుంచి జె పీటర్ 571 మార్కులు సాధించారు.



567 మార్కులు సాధించిన షమీనాఅఫ్రోజ్‌తో బాలిక తల్లిదండ్రులు

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : పదోతరగతి పరీక్షలకు మండలంలోని ఏడు జిల్లా పరిషత్ పాఠశాలల నుంచి 545మంది హాజరుకాగా, 345మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ జీ బాలాజీ తెలిపారు. పెండ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేములపల్లి గ్రామానికి చెందిన వీ నాగలక్ష్మి 600ల మార్కులు గానూ 554 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానంలో నిలిచిందని వివరించారు. గండేపల్లిలో ఎంవీఏ ప్రసాద్ 546 మార్కులు, కంచికచర్లలో జీ జాహ్నవి 544 మార్కులు, పరిటాలలో పీ హరిణి 540 మార్కులు సాధించినట్లు ఎంఈవో తెలిపారు.

విజయరాణి ఉన్నత పాఠశాల...

కంచికచర్ల విజయరాణి ఉన్నత పాఠశాలలో మేడి పృధ్వీవేణు 584 మార్కులు సాధించినట్లు రెవరెండ్ సిస్టర్ క్రీస్తు రాణి తెలిపారు. పానుగోలు మనస్విత 581, పెన్నేరు చైతన్య ఈశ్వర్ 579 మార్కులు సాధించినట్లు వివరించారు.

నందిగామ మండలంలో..

నందిగామ: పదోతరగతి పరీక్షా ఫలితాల్లో నందిగామ డివిజన్‌లో 81.6శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు డివిజనల్ విద్యాశాఖాధికారి ఎం.వెంకటప్పయ్య తెలిపారు. పరీక్షలకు మొత్తం 4,283మంది విద్యార్థులు హాజరుకాగా, 3,498 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఆయన వివరించారు. నందిగామ మండలంలో 637 మంది విద్యార్థులకుగాను 478 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. నందిగామ మండలంలో 75.03శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. నందిగామలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పొదిలి నాగప్రతిభ 600 మార్కులకుగాను 576 మార్కులు సాధించింది. పూజల యేసుబాబు 569 మార్కులు, షేక్ నాగుల్‌బీ 565 మార్కులు సాధించారు. నందిగామ మండలం పెద్దవరం పాఠశాల విద్యార్థులు 97శాతం ఉత్తీర్ణత సాధించారు.



కొండపల్లి దివ్య (563)



కోలా మహేష్ (553)



గొర్రెపాటి సృజల (549)



వి.నాగలక్ష్మి (554)



ఏసుబాబు (569)



నాగుల్‌బీ (565)

చందర్లపాడు మండలంలో..

చందర్లపాడు మండలంలోని తోటరావులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు:పదోతరగతి పరీక్షలకు మండలం నుంచి 418మంది విద్యార్థులు హాజరుకాగా, 369మంది ఉత్తీర్ణులైనట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు. వెల్లంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని షేక్ షమీనాఅఫ్రోజ్ పదోతరగతి పరీక్షల్లో 600 మార్కులకుగాను 567 మార్కులు సాధించి వీరులపాడు మండలస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. ఆమె తండ్రి తాపీమేస్త్రిగా పనిచేస్తున్నారు. అత్యుత్తమ ప్రతిభను చూపిన షమీనాఅఫ్రోజ్‌ను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఘనంగా ప్రతిష్ఠా మహోత్సవం



చందర్లపాడు(నందిగామ టౌన్):కాండ్రపాడు గ్రామంలోని రాజరాజేశ్వరీ సమేత మహా పంచముఖేశ్వరస్వామి వారి ప్రతిష్ఠా కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహోత్సవలలో భాగంగా సోమవారం విఘ్నేశ్వర పూజ, పీఠ, గర్త పూజలు, రత్నన్యాసం, బీజన్యాసం, ధాతు న్యాసం, యంత్రస్థాపన, కుంభం పోయుట, పూర్ణాహుతి పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. రాజగోపురానికి కుంభాభిషేకం, ప్రథమ పూజ, ఆశీర్వచనం, దీక్షావిరమణ, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ ప్రతిష్ఠా మహోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు కొండా కృష్ణారెడ్డి, బొల్లినేని శ్రీనివాసరావు, వీరాంజనేయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు సామినేని ఉదయభాను నామినేషన్ కార్యక్రమం



జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా సామినేని ఉదయభాను ఈనెల 24 వ తేదీ బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ నామినేషన్ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలంతా హాజరుకావాలని వారు కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు కుందవరపు సుబ్బారావు, రాధాకృష్ణ, శ్రీనివాసు పాల్గొన్నారు.

నందిగామ ప్రజలకు రుణపడి ఉంటా

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



ఎమ్మెల్యే జగన్‌మోహనరావుకు హారతి ఇచ్చి ఆత్మీయ స్వాగతం పలుకుతున్న మహిళలు

నందిగామ టౌన్: రాజకీయాల్లోకి అడుగుపెట్టిన నాటి నుంచి తమను ఆదరించి అక్కున చేర్చుకున్న నందిగామ నియోజకవర్గ ప్రజలకు సదా రుణపడి ఉంటానని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. స్థానిక 10, 15వవార్డు పరిధిలోని బీసీకాలనీ, శ్రీరామ్ నగర్, వివేకానంద పాఠశాల తదితర ప్రాంతాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు.

రానున్న ఎన్నికలలో సైతం అండగా నిలిచి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావుకు స్థానిక మహిళలు

హారతులు ఇచ్చి ఆత్మీయ స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ తమ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ ఐదేళ్లలో అన్నివర్గాల ప్రజలకు మేలు చేసిందన్నారు. 10, 15వ వార్డుల్లో సిమెంటురోడ్లు, డ్రైన్ల నిర్మాణం తోపాటు మౌలికవసతులు కల్పించామన్నారు. గత పాలకుల హయాంలో కనీస వసతులకు నోచుకోని కాలనీలు సైతం నేడు అన్ని వసతులతో దర్శనమిస్తున్నాయని వివరించారు. పార్టీలు, రాజకీయాలు చూడకుండా తమ వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరికి నేను చేయగలిగినంత మంచి చేశానని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికలలో మరోసారి తనకు అండగా నిలిచి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఓర్సు లక్ష్మి, వార్డు కన్వీనర్ ఓర్సు జ్వాలా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, నాయకులు తోట అంజారావు, షేక్ ఖాలిక్, బండారు గంగమ్మ, పాములపాటి రమేష్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, చిరుమామిళ్ల చైతన్యకుమార్, షేక్ జాఫర్, మన్నెం దాసు, షేక్ ఫాతిమా, షేక్ యాకుబ్ అలీ, ఓర్సు కొండ, కార్యకర్తలు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేసి ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

వైఎస్సార్ సీపీలోకి చేరికలు

గండ్రాయి(జగ్గయ్యపేట): సీఎ జగన్‌మోహన్ రెడ్డి చేసిన సంక్షేమ అభివృద్ధిని చూసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారని యువ నాయకులు సామినేని వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. గ్రామానికి చెందిన తొమ్మిది టీడీపీ కుటుంబాల వారు ఆ పార్టీని వీడి గ్రామ సీనియర్ నాయకులు కనపర్తి శేషగిరిరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి సోమవారం చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో అమరబోయిన సత్యన్నారాయణ, కొరివి హరికృష్ణ, నాగరాజు, ఉపేందర్, నాగాటి ఈశ్వర్, సాధనాల చిన్న సైదులు, కర్నే కృష్ణ, గోని శ్రీరాంమూర్తి, నాగాటి బ్రహ్మం ఉన్నారు. కార్యక్రమంలో సర్పంచిలూర్దు మేరి, గ్రామ పార్టీ అధ్యక్షులు కనపర్తి ప్రసాద్, నాయకులు కొరివి శ్రీను, రమేష్, లక్ష్మయ్య, అంజి పాల్గొన్నారు.



గండ్రాయిలో పార్టీలోకి చేరిన వారితో వెంకట కృష్ణప్రసాద్

నందిగామ: నందిగామ మండలం జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని మాగల్లు గ్రామానికి చెందిన పలు కుటుంబాలు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరాయి. వారికి కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఉదయభాను విజయం కోరుతూ ప్రచారం

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ అభ్యర్థి సామినేని ఉదయభానును గెలిపించాలని కోరుతూ ఆయన కుటుంబసభ్యులు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని క్రిస్టియన్‌పేట, మిట్టగూడెంలో ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సతీమణి విమలాభాను, సోదరి చాముండేశ్వరి(బేబి), కుమార్తె పద్మప్రియాంక కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి జగ్గయ్యపేట అభివృద్ధిని వివరిస్తూ ప్రచురించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. పార్టీలు, కులమతాలకతీతంగా అర్హులందరికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించిందని గుర్తుచేశారు. నియోజకవర్గ అభివృద్ధిని గుర్తించి, రానున్న ఎన్నికల్లో మరోసారి ఉదయభానును గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, మాజీ కౌన్సిలర్ గెంటేల భాగ్యలక్ష్మి, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు తుమ్మల వెంకట నాగమణి, నాయకులు సలాది సూరిబాబు, సయ్యద్ అలీ, గెంటేల రాము పాల్గొన్నారు.



ఉదయభానును గెలిపించాలంటూ ఓట్లు అభ్యర్థిస్తున్న విమలాభాను

ప్రజాసంక్షేమమే సీఎం జగనన్న లక్ష్యం

ముచ్చింతాల(పెనుగంచిప్రోలు):ప్రజాసంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని సర్పంచి జక్కులూరి రాంబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి గుజ్జర్లపూడి వడ్డీకాసులు అన్నారు. విజయవాడ వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, జగ్గయ్యపేట ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను విజయాన్ని కోరుతూ మండలంలోని ముచ్చింతాలలో సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎంపీ, ఎమ్మెల్యేలుగా కేశినేని నాని, ఉదయభానులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో ఎంపీటీసీ సభ్యురాలు బేరోతుల నాగమణి, గ్రామ పార్టీ అధ్యక్షుడు నూకవరపు శ్రీనివాసరావు, నాయకులు గోనెల శివ, కె.జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న ముచ్చింతాల సర్పంచి రాంబాబు, వడ్డీకాసులు

తిరుమలగిరి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తిరుమలగిరి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమలగిరి వెంకటేశ్వరస్వామి వారి కల్యాణో మహోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చానలను ఆలయ అర్చకులు పరాంకుశం వాసుదేవాచార్యులు, తిరునగరి రామకృష్ణమాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పెండ్లి కుమారునిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మాలధారణలో ఉన్న స్వాములు ఇరుముడులు సమర్పించారు. ఆలయ ఇన్‌ఛార్జ్ ఈవో నూతక్కి సాంబశివరావు, సిబ్బంది, పాల్గొన్నారు.



పెండ్లి కుమారుని అలంకరణలో వెంకటేశ్వరస్వామి

నేడు స్వామివారి కల్యాణం..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి 9గంటలకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రకృతిని పరిరక్షించటం అందరి బాధ్యత అని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జే లక్ష్మీనారాయణ అన్నారు. ప్రపంచ ధరిత్రీ దినోత్సవాన్ని పురస్కరించుకొని రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ పీఎస్‌సీఎంఆర్, ఎన్ఎస్ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ, పలు అంశాలపై పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీని ప్రారంభించిన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భూమిని కాపాడుకోవటం ద్వారా సంతోషకరమైన ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపగలమన్నారు. మానవ జీవన విధానంలో ప్లాస్టిక్ వాడకం అధికమైందని చెప్పారు. అలాగే సుఖవంతమైన, విలాసజీవనానికి అలవాటు పడిన ప్రజలు ఆయా వస్తువుల ద్వారా అనేక వ్యర్థాలు, వాయువులను విడుదల చేయటం భూమికి చాలా ప్రమాదాన్ని తెచ్చిపెడుతున్నాయన్నారు. ఇంధనాల వినియోగం రోజురోజుకు పెరగటం వలన భవిష్యత్ తరాలు ఇబ్బందులు పడే ప్రమాదముందన్నారు. వీటిపై సమాజాన్ని జాగృతం చేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని పేర్కొన్నారు.అధ్యాపకులు డాక్టర్ పి.నరేష్, బి.శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ ఏ.రమాదేవి, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.